www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శుక్రవారం | 12 | సెప్టెంబర్ | 2025

పేజీలు : 7

## సెంట్రల్ మెడికల్ స్టోర్‌ను తనిఖీచేసిన కలెక్టర్



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : రామవరం మాతశిశు ఆరోగ్య కేంద్రం లోని సెంట్రల్ మెడికల్ స్టోర్‌ను గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టోర్‌లో నిల్వ ఉంచిన ఔషదాల లభ్యత, నాణ్యత, గడువుతేది అసుపత్రులకు సరఫరా ప్రక్రియను పరిశీలించారు. రోగులకు అవసరమైన మందులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, గడువు ముగిసిన

మిగతా 2లో..

# చరిత్రను వక్రీకరిస్తే జాతి క్షమించదు

**-తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మహత్తర ఘట్టం**

**-సాయుధ పోరాట వారోత్సవాలను ప్రారంభించిన బాగం**



ప్రజాపక్షం/ ఖమ్మం : చరిత్రను వక్రీకరిస్తే తెలంగాణ జాతి క్షమించదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. తెలంగాణ పోరాటాన్ని మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, తెలంగాణ పోరాటంలో బిజెపికి ఎటువంటి పాత్ర లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ప్రారంభ సందర్భంగా గురువారం పాత బస్టాండ్ సమీపం లోని సాయుధ పోరాటయోధుడు, సిపిఐ అగ్ర నాయకులు నల్లమల గిరిప్రసాద్ విగ్రహానికి పూల మాలలు వేసి వార్షికోత్సవాలను హేమంతరావు ప్రారంభించారు. పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ఆవిష్కరించారు.

మిగతా 2లో..

## తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలు చిరస్మరణీయం



**- సెప్టెంబర్ 17 ప్రజాస్వామ్య హక్కులు సాధించుకున్న సుదినం**

**- సాయుధ పోరాట స్ఫూరితో నయా దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలి**

**- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**

**- ప్రారంభంమైన పోరాట వారోత్సవాలు**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : నైజాం నిరంకుశ పాలనను అంతం చేసేందుకు సాగిన తెలంగాణ సాయుధ పోరాట స్పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నయా దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సుజాతనగర్ మండల పరిధిలోని నాయకులగూడెంలో సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన అమరుడు రావి నారాయణరెడ్డి స్తూపం వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళ్లర్పించారు. ముందుగా అరుణపతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో పాషా మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం స్వాతంత్ర భారత చరిత్రలో అపూర్వమైన అధ్యాయం అన్నారు. పేద రైతుల

మిగతా 2లో..

## అడవుల సంరక్షణే నిజమైన నివాళి





**-అటవీ సంపదను బాధ్యతగా కాపాడుకోవాలి**

**-అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్**

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అడవుల సంరక్షణ అటవీ అమరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం నందు అటవీ అమర వీరలు సంస్మరణ దినోత్సవం సందర్భంగా అటవీ సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రం సింగ్‌లతో కలిసి పాల్గొన్నారు. అటవీ అమర వీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అమరవీరుల సంస్మరణార్థం రెండు నిమిషాలు మౌనం పాటించి అటవీ వన్యప్రాణి రక్షణ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2022లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా

మిగతా 2లో..

## ప్రమాదకరంగా రోడ్డుపై గుంతలు..!




**-ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం**

**-పట్టించుకోని సంబంధిత అధికారులు**



ప్రజాపక్షం/వైరా: వైరా నుండి బోనకల్ రోడ్డు అడుగడుగునా గుంతలతో అతి ప్రమాదకరంగా కనిపిస్తుంది. ప్రాణాలు పోతాయో అనే అంత విధంగా గుంతలు కనిపిస్తున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే రాత్రిపూట వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైరా మండలం తాటిపూడి గ్రామంలో అతి ప్రమాదకరంగా గుంతలు ఏర్పడి ప్రమాదానికి నిలయంగా మారాయి. వర్షం వస్తే రోడ్లు, చెరువులను తలపించే విధంగా కనిపిస్తున్నాయి. గొల్లపూడి గ్రామం వద్ద రోడ్డుపై ఉన్న గుంతలు చూస్తే పెద్ద పెద్ద కోరీలను తలపిస్తున్నాయి. అతివేగంగా వచ్చే వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు.

మిగతా 2లో..

# చరిత్రను వక్రీకరిస్తే జాతి క్షమించదు





(మొదటిపేజీ తరువాయి)
యర్రాబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంత రావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిజాం స్వాతంత్ర రాజుగా ప్రకటించుకున్న తర్వాత రావి నారాయణరెడ్డి, ముగ్దూం మోహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. నిజాం రక్కసి పాలనకు వ్యతిరేకంగా సాగిన మహోత్తర పోరాటంలో సామాన్యులు సాయుధులై పోరాడారని హేమంతరావు తెలిపారు. నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు అమరులయ్యారన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన ఈ పోరాటంలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారని సాయుధ పోరుకు పిలుపు నిచ్చిన వారిలో మగ్దూం మోహినుద్దీన్ కూడా ఉన్నారని హేమంతరావు తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటం లేకుంటే భారతదేశపు నడిబొడ్డున తెలంగాణ మరో కశ్మీర్‌లా రగులుతూనే ఉండేదన్నారు. తెలంగాణకు సంబంధించి సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలన్న విషయంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒకే వైఖరితో ఉండటం దురదృష్టకరమన్నారు. నాటి సాయుధ పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు హేమంతరావు తెలిపారు. దేశంలో నెలకొన్న ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలను తెలంగాణ పోరాట స్ఫూర్తితో కొనసాగిస్తామన్నారు. కార్యక్రమానికి ముందు అంబేద్కర్ సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, కార్పొరేటర్ బిజి క్లైమెంట్, మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా సమితి సభ్యులు వరదా నర్సింహారావు, తాటి నిర్మల, బోడా వీరన్న, ఎస్‌కె సైదా, మోహన్‌రావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలు చిరస్మరణీయం



(మొదటిపేజీ తరువాయి)
భూదాస్య నిర్మూలన, జమీందారీ వ్యవస్థ కూల్చివేత కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి పోరాటయోధుల త్యాగాలు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఆ కాలంలో కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో వేలాది మంది రైతులు, కూలీలు, గిరిజనులు తుపాకీలు, తాటికొడవలి,విల్లు బాణాలు పట్టుకుని జమీందారీల దోపిడీని ఎదురించారని తెలిపారు. ఈ పోరాటం వల్లే వేలాది ఎకరాల భూమి పేదలకు పంచబడిందని, పల్లెల్లో గణనీయమైన సామాజిక మార్పులు చోటు చేసుకున్నాయని వివరించారు. రావి నారాయణరెడ్డి, మగ్దూం మొహీయుద్దీన్ బద్దం ఎల్లారెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షం, చాకిల ఐలమ్మ వంటి మహనీయ సాయుధ పోరాట యోధుల విగ్రహాలను, స్మారక కేంద్రాలను ఒకేచోట ఏర్పాటు చేస్తే తెలంగాణ ప్రజలకు అది శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. అంతే కాకుండా పోరాట యోధుల పేర్లు చిరస్థాయిలో నిలిచిపోయే విధంగా ప్రభుత్వం ఆయా పథకాలకు నామకరణ చేయాలని, పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. నాటి మహత్తర పోరాటాన్ని బీజేపీ హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తోందని, రాచరికాని, నిర్భందానికి వ్యతిరేకంగా పోరాడిన వారిలో అన్ని వర్గాల వారు ప్రాణత్యాగాలు చేశారని, బీజేపీ ఎంఐఎం గుర్తుంచుకోవాలన్నారు. కమ్యూనిస్టులు చేసిన వీరోచిత పోరాటాలను తట్టుకోలేకనే నైజాం రాజు హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన సుదినం సెప్టెంబర్ 17అని చెప్పారు. సాయుధ పోరాట అమరులు ఆశించిన లక్ష్యాల సాధన దిశగా పోరాటాలు ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాల్లో వారోత్సవాలు ప్రారంభమయ్యాయని, 17న జిల్లా, రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున విలీన దినోత్సవాన్ని జరుపుతామన్నారు. సుజాత నగర్ మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, చంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, భూక్యా ధస్రు, కందుల భాస్కర్, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వి పద్మజ, కె రత్నకుమారి, జక్కుల రాములు, తాళ్లూరి పాపారావు, అజిత్, ఎస్ విజయలక్ష్మీ, నాయకులు యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణ చారి, గుత్తుల శ్రీనివాస్, మిరియాల రాము, మూడ్ గణేష్, దండు నాగేశ్వరరావు, కోమారి కృష్ణ, ఈర్ల రమేష్, తాళ్లూరి ధర్మారావు, బాలు రామయ్య, శ్రీను, రమేష్, నరేష్, మెదిని లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# అడవుల సంరక్షణే నిజమైన నివాళి

(మొదటిపేజీ తరువాయి)
ఉన్న సమయంలో శ్రీనివాసరావు అనే అటవీ అధికారి అకాల మరణం చెందారని వారి మరణం తనను కలిచివేసిందన్నారు. అటవీ పరిరక్షణ మీద అనేక సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. అడవుల సంరక్షణకు నిర్విరామంగా కృషి చేస్తున్న అటవీశాఖ సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అటవీశాఖ సిబ్బందిని సైలెంట్ హీరోస్‌గా కలెక్టర్ అభివర్ణించారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా అటవీ పరిరక్షణ కోసం అటవీశాఖ సిబ్బంది వీరోచితంగా పని చేయడం జరుగుతుందన్నారు. అడవులను నరుక్కుంటూ పోతే మన మనుగడ కష్టమవుతుందని మానవ జీవన విధానంలో చెట్లు చాలా కీలకమన్నారు. జిల్లాలో వన సంపద కాపాడే బాధ్యత మనందరిపై ఉందన్నారు. పర్యావరణాన్ని కాపాడుతూ ఏకో టూరిజం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లాలో అనేక చోట్ల డిజిటల్ డిటాక్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. అటవీ అమరవీరుల స్ఫూర్తితో అడవుల సంరక్షణకు అధికారులంతా కృషి చేయాలన్నారు. జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ మాట్లాడుతూ అటవీ అమరవీరుల త్యాగం మనందరికి స్ఫూర్తి



అన్నారు. అటవీ సంరక్షణ ఒక బాధ్యత మాత్రమే కాదని ప్రతి పౌరుడి కర్తవ్యమన్నారు. అనంతరం అటవీ సిబ్బందికి సంరక్షణ పరికరాలు, రెయిన్ కోట్లు, స్టిక్ గార్డ్స్‌లను కలెక్టర్ పంపిణీ చేశారు. జిల్లా మానిటరింగ్, అటవీ రక్షణలో వినియోగించే కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించారు. సిసి కెమెరా పని తీరు ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖాధికారులు, అటవీ అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పార్కింగ్ స్థలాలను గుర్తించండి : సిపి సునిల్‌దత్




ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : ట్రాఫిక్ క్రమబద్ధికరణతో పాటు నగరంలో పార్కింగ్ స్థలాలు గుర్తించాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ట్రాఫిక్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ట్రాఫిక్ నిర్వహణలో ఉన్న సవాళ్లను స్టేషన్ సిబ్బంది, హౌస్‌ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్‌కు సమస్య పరిష్కారంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో అదనంగా సిబ్బందిని మోహరించాలన్నారు. ప్రజలు, వాహనదారులతో వివాదాలకు పాల్పడకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరిచాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పై దృష్టిసారించాలని, నగరంలో సిసి కెమెరాలను విస్తరించడంతో పాటు బాడివార్మ్ కెమెరాలు వినియోగించాలన్నారు. విటి వలన సంఘటన సమయంలో స్పదన, ప్రతిస్పదనను గుర్తించి జరిమానాలు విధించవచ్చని సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ క్రమబద్దీకరణలో భాగంగా వ్యక్తిగత సంస్థలు, మున్సిపాల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో పార్కింగ్ స్థలాలను గుర్తించాలన్నారు. అదేవిధంగా ట్రాపిక్ నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లను, అవకాశాలపై స్టేషన్ ఎస్‌హెచ్ఓ, సిబ్బందితో చర్చించారు. ట్రాఫిక్ పరికరాల వినియోగం, అవసరాలపై సమీక్షించారు. అనంతరం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలను పార్కింగ్, వాటి నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు.

# సెంట్రల్ మెడికల్ స్టోర్‌ను తనిఖీచేసిన కలెక్టర్

(మొదటిపేజీ తరువాయి)
మందులను తక్షణమే తొలగించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. తనిఖీ సందర్భంగా సిబ్బంది కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ప్రధాన రహదారి నుండి స్టోర్‌కు వచ్చే రహదారిని మరమ్మత్తులు చేయాలని, సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని, మందుల నిల్వర్యాకులు, బరువైన బాక్సులు ఎత్తేందుకు యంత్రాలు సమకూర్చాలని కోరడంతో స్పందించిన కలెక్టర్ అవసరమైన అన్ని సదుపాయాలు త్వరలో ఏర్పాటుచేస్తామన్నారు. స్టోర్‌లోనికి ఒక హాల్ ఫ్లోరింగ్ పనులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని గమనించారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి అవసమరైన నివేదికలు వెంటనే ఇవ్వాలని,ఫ్లోరింగ్ పనులు వెంటనే పూర్తి చేసి వాడుకలోనికి తేవాలని సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట సీనియర్ ఫార్మసీ అధికారి శారద, ఫార్మసిస్ట్ అధికారి రామచందర్, సెంట్రల్ మెడికల్ స్టోర్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా రోడ్డుపై గుంతలు..!



(మొదటిపేజీ తరువాయి)
ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతాయో అని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని రోజులుగా రోడ్లపై ఉన్న గుంతల గురించి ప్రజలు ఆందోళన చేస్తున్న కూడా అధికారుల్లో చలనం రావడం లేదు. ప్రాణాలు పోయి పెను ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా అని ప్రజలు ఆశిస్తున్నారు. నిత్యం వైరా బోనకల్ రోడ్డులో వందలాది వాహనాలు నడుస్తూ ఉన్నాయి. తాటిపూడి గొల్లపూడి వద్ద ఉన్న గుంతలు చూస్తేనే గుండెపగిలే విధంగా కనిపిస్తున్నాయి. రాత్రిపూట ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు గ్రామస్థులు కట్టెపుల్లలో పెట్టి వాటికి గోనె బస్తాలను కనపడే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని అతి ప్రమాదకరంగా ఉన్న రోడ్లపై గుంతలను మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాల బారి నుండి వాహనదారులను కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**-డిసెంబర్ నాటికి అంగన్‌వాడీ, జిపి భవనాలు పూర్తి చేయాలి**
**-అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ సమీక్ష**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని నిర్మాణం ఆలస్యమైతే ఖర్చులు పెరిగి ప్రభుత్వంపై భారం పడుతుందన్నారు. జిల్లాకు మంజూరైన 41 అంగన్‌వాడీ కేంద్రాల్లో 40,101 గ్రామ పంచాయతీ భవనాల్లో 70 నిర్మాణంలో ఉన్నాయన్నారు. 30 జిపి భవనాలు, ఒక అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం పూర్తయిందన్నారు. పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేసి డిసెంబర్ చివరి నాటికి జిపి భవనాలు, అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. 11 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లలో ఐదు పూర్తి చేశామని నాలుగు నిర్మాణాలు ప్రారంభం కాకపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, యూనిట్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మేర టాయిలెట్స్ నిర్మాణ పనులు ఉపాధి హామీ క్రింద చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన చేపట్టాలన్నారు. రఘునాథపాలెం మండలంలో మంజూరైన చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సత్తుపల్లి, మధిర, పాలేరు ప్రాంతాల్లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రతిపాదనలు అందించాలన్నారు. ఖమ్మం నగరంలో ఆర్అండ్‌బి రోడ్డు నిర్వహణ మరమ్మతు పనులు కార్పోరేషన్ చేపట్టాలన్నారు. 50 సబ్ సెంటర్ పనుల్లో 38 పూర్తి చేశామని మరో 12 సబ్ సెంటర్ పనులు పూర్తి చేసి వైద్యశాఖకు అప్పగించాలన్నారు. 50 శాతం పూర్తయిన అభివృద్ధి పనులపై దృష్టిపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించి అక్టోబర్ తర్వాత చెక్‌డ్యాం పనులు ప్రారంభించాలన్నారు. భూసేకరణ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. సీతారామ పనులు ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపివో ఎ. శ్రీనివాస్, డిఆర్‌డివో సన్యాసయ్య, డిడబ్ల్యూవో రాంగోపాల్ రెడ్డి, యాకోబు, వెంకటరెడ్డి, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలి

**-పలు డివిజన్లలో పర్యటించిన కమిషనర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** డివిజన్లలో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలోని 54, 55, 46 డివిజన్లలో కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి ప్రతిరోజు ఆటో, ట్రాక్టర్ వస్తుందా, కాలువలు శుభ్రం చేస్తున్నారా అని కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. వర్కర్ల రోజు వారి హాజరు, ఎక్కడ పనిచేస్తున్నారు, ఏఏ పనులు నిర్వహిస్తున్నారు వంటి వివరాలను పరిశీలించారు. ఆయా డివిజన్ల అటెండెన్స్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆటోలు, ట్రాక్టర్లు రోజు ఎక్కడ పనిచేస్తున్నాయి, ఎన్ని వాహనాలు అందుబాటులో ఉన్నాయి, పనికి రాని వాహనాలు ఏమైనా ఉన్నాయా వంటి వివరాలను శానిటరీ సూపర్‌వైజర్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు డివిజన్లలో పారిశుధ్య పనులు ప్రారంభించాలని వాహనాలు కూడా ఉండాలన్నారు. పనులను శానిటరీ సూపర్‌వైజర్ పర్యవేక్షించాలన్నారు. డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ తప్పనిసరిగా డివిజన్లలో పర్యటించి పారిశుధ్య పనులపై ప్రతి రోజు రిపోర్టు అందించాలన్నారు. ఎటువంటి సమాచారం లేకుండా డివిజన్లలో తనిఖీ చేపడతామని ఎక్కడైనా లోపాలు కనిపిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన వైద్య సేవలను అందించడమే లక్ష్యం



**-పట్టణ ఆరోగ్య కేంద్ర పనులు పరిశీలించిన మేయర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలోని నాల్గవ డివిజన్ పరిధిలో నిర్మాణం ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.43 కోట్లతో ఆరోగ్య కేంద్ర నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే లక్ష్యమన్నారు. ఆరోగ్య సేవలు విస్తరించడం ద్వారా స్థానిక ప్రజలు పెద్దాసుపత్రుల వరకు వెళ్లే ఇబ్బందులు ఉండవన్నారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఈ ధరణికుమార్, ఏఈ తేజ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలికి కీర్తి పురస్కారం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, ఉత్తమ ఉపాధ్యాయురాలు పూరిమళ్ల సునందకు 2024 సంవత్సరానికి గాను తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేస్తున్న వారికి ఈ పురస్కారం అందజేస్తారు. పూరిమళ్ల సునంద ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూనే సాహిత్యంలో రాణిస్తున్నారు. కవయిత్రిగా, రచయిత్రిగా, బాల సాహితివేత్తగా విశేష కృషి చేస్తున్నారు. తాను పనిచేసే ప్రతి పాఠశాలలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ సాహిత్యంలో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రతి యేటా తన సోదరి పూరిమళ్ల పద్మజ పేరుతో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నారు. పూరిమళ్ల ఫౌండేషన్‌లో 2019లో స్థాపించి లబ్ధ ప్రతిష్టులైన సాహితీ వేత్తలకు భోగోజు సముద్రమ్మ పురుషోత్తం స్మారక నగదు పురస్కారాన్ని అందజేస్తున్నారు. ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై పూరిమళ్ల సునంద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఇటు ఉపాధ్యాయ రంగంలోనూ, అటు సాహిత్య రంగంలోనూ విశేష కృషి గావిస్తున్న పూరిమళ్ల సునందకు తెలుగు పురస్కారం లభించింది. ఈనెల 23, 24 తేదీల్లో జరిగే ఉత్సవంలో కీర్తి పురస్కారాన్ని సునంద అందుకోనున్నారు. కీర్తి పురస్కారం ప్రకటించడం పట్ల జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు, కవులు, రచయితలు సునందకు శుభాకాంక్షలు తెలిపారు.

## రేపు ఖమ్మంలో సురవరం సంస్మరణ సభ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ సెప్టెంబర్ 13న ఖమ్మంలో జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు లు ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈనెల 13 శనివారం సాయంత్రం నాలుగు గంటలకు సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జరుగుతుందని ఈ సభకు రైతు సంఘం బాధ్యులు పెద్ద ఎత్తున తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాలకే ఊపిరిగా నిలిచిన అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి కి ఘనంగా నివాళులర్పించేందుకు రైతు సంఘం ఆఫీస్ బేరర్స్ కౌన్సిల్ సభ్యులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ప్రత్యేక బాధ్యత తీసుకుని ఈ సంస్మరణ సభను జయప్రదం చేయాలని వారు కోరారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



**ప్రజాపక్షం/మధిర :** మండల పరిధిలోని వంగవీడు, కృష్ణాపురం, మధిర పట్టణంలోని ఎంప్లాయీస్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 5, 6వ తరగతి విద్యార్థులకు వనమా ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నోట్‌బుక్స్, పెన్నులు, జామెంట్రీ బాక్సులు వితరణగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ వనమా సూరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు తమవంతు సహాయంగా ట్రస్టు ఆధ్వర్యంలో వారికి అవసరమయ్యే విద్యా సామాగ్రి,మౌలిక వసతులను అందించటం జరిగిందని, మునుముందు కూడా వనమా ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వంగవీటి రాజశేఖర్, వేములపల్లి శ్రీనివాసరావు, ప్రసాద్, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి వనమా కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత




**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** భవిష్యత్ తరాల మనుగడ కోసం పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ప్రముఖ సామాజిక సేవకులు లంకా కొండయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని రొంపిమళ్ళ గ్రామంలో పాస్టర్ జీ దయాకర్ చర్స్ ప్రాంగణంలో మధిర నియోజకవర్గ పాస్టర్ పెలోషిప్ ట్రస్టు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లంకా కొండయ్య మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి ఆవరణంలో మొక్కలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెలోషిప్ ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు దేవారాజు, జి.దయాకర్, ట్రెజరర్ పాస్టర్ ఆదమ్‌ఎలీషా, గౌరవాధ్యక్షులు జీవరత్నం, తిమోతి, సిస్టర్ అనితగ్రేస్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రరావుకు టిడిపి నివాళి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త గడిపూడి వీరభద్రరావు బుధవారం తన మిర్చి పొలంలో అరక పాటు చేయిస్తున్న క్రమంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన విషయం విధితమే. గురువారం ఆయన పార్థివ దేహాన్ని టిడిపి ఖమ్మం జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం సందర్శించి పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆయనమాట్లాడుతూ వీరభద్రరావు మృతి పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ ఎల్లవేళలా కుటుంబానికి అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని కోరారు. మృతి చెందిన గుడిపూడి వీరభద్రరావుకు తెలుగుదేశంపార్టీ సభ్యత్వం ఉన్నందున ప్రమాద బీమా రూ.5లక్షలు మంజూరైవిధంగా మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయానికి సమాచారం అందించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మల్లాది హన్మంతరావు, యువత నాయకులు దొపాటి అనీల్, వూట్ల నవీన్, చినిక్ష్ణమూర్తి, పుచ్చకాయల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## సబ్ సెంటర్ల ద్వారా ఎరువులు పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సొసైటీల పరిధిలో సబ్ సెంటర్లను ఏర్పాటు చేసి రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. మంచుకొండ సహకార సంఘం పరిధిలో గురువారం సబ్ సెంటర్ల ద్వారా యూరియా పంపిణీ ప్రారంభించినట్లు సంఘం కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఈర్లపుడి గ్రామంలో సబ్ సెంటర్ ద్వారా రైతులకు కూపన్లు అందించి 450 యూరియా కట్టలను పంపిణీ చేసినట్లు సిఈవో తెలిపారు. మంచుకొండ సొసైటీ వద్ద 335 కట్టలు రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. శుక్రవారం చిమ్మపుడిలో రైతులకు 335 యూరియా కట్టలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పోలీస్ బందోబస్తు మధ్య రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియాను పంపిణీ చేశారు. రైతులకు ముందుగానే కూపన్లు పంపిణీ చేసి ఎరువులు అందజేస్తున్నట్లు సిఈవో తెలిపారు.

# తాటిపూడి గ్రామంలో పర్యటించిన ఎంపిడిఓ




-నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ పరిశీలన
-ఎయిర్ వాల్స్ సమస్యలతో నీటి సరఫరాకు అంతరాయం
-నివేదికను కలెక్టర్‌కు అందజేస్తాం



తాటిపూడిలో తాగునీటి సమస్యకు పరిష్కారమెప్పుడు?

ప్రజాపక్షం/వైరా: వైరా మండలం తాటిపూడి గ్రామంలో తరచుగా త్రాగునీటి సరఫరాలో ఇబ్బందులు జాప్యం జరుగుతూనే ఉంది. సమస్య వచ్చినప్పుడు ప్రజలు అడిగడం అధికారులు సమాధానం చెప్పడమే జరుగుతుంది తప్ప సమస్యకు పరిష్కారం ఎక్కడ కనిపించడంల లేదు. ఈ గ్రామంలో లక్షలు పెట్టి నిర్మించిన వాటర్ ట్యాంక్ గ్రామ ప్రజలకు ఉపయోగపడకుండా నిరుపయోగంగానే ఉంది. ఈ ట్యాంక్ విషయంలో రెండు శాఖల మధ్య సమన్వయం లేదనే చెప్పవచ్చును. ట్యాంకు సరఫరాకు నీటిని అందించాల్సింది ఎవరు? భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మా తప్పిదం లేదని వారు చెబుతున్నారు. మరి ట్యాంక్ చేసిన పాపం ఏమిటి? దీనికి బాధ్యత ఎవరిది? లక్షల రూపాయలు ఉంటే బాగుంటదా? గ్రామానికి మంచిదా త్రాగునీటి సమస్య తీరుపద్దా ఒక్కసారి ఆలోచించండి. అధికారులు పూర్తిస్థాయిలో జోక్యం చేసుకొని తాటిపూడి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రజలకు తాగు త్రాగునీటి ఇబ్బంది ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు త్రాగునీరు వస్తుందో ఎప్పుడు బంద్ అవుతుందో వచ్చిన నీరు పంపులు వదిలిన పది నిముషాలకే ఆగిపోతుంది. ఇలా అయితే ఎల ఆగ్రామంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ మనుగడలోకి తీసుకొస్తే త్రాగునీటి సమస్యకు పరిష్కారం ఉంటుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మరో పక్క పాత తాగునీటి వాటర్ ట్యాంక్ ప్రమాదకరంగా ఉందని చెప్పవచ్చును. వాటర్ ట్యాంక్ ఎక్కి శుభ్రం చేయాలి అంటే ట్యాంకు పక్కన ఎక్కాల్సిన ఇనుప నిచ్చెనలు తుప్పు పట్టి విరిగిపోయి కనిపిస్తున్నాయి. దీనివలన ట్యాంక్‌లో కూడా అపరిశుభ్రత ఏర్పడే ప్రమాదం కూడా ఉంది. జిల్లా అధికారులు జోక్యం చేసుకొని తాటిపూడి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నూతన వాటర్ ట్యాంక్‌ను త్రాగునీటి సరఫరా చేసి


ప్రజాపక్షం/వైరా: వైరా మండల తాటిపూడిలో గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నూతన వాటర్ ట్యాంక్‌ను మండల పరిషత్ అధికారి సక్రియ, ఎంపివో రాజేశ్వరి మిషన్ భగీరథ అధికారులు, గ్రామపంచాయతీ సెక్రటరీతో కలిసి నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంకుకు నీళ్లు ఎందుకు ఎక్కడం లేదు అనేదానిపై ఎంపిడివో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ జరిపి పైప్‌లైన్ హెవీ వాహనాలు తిరగడంతో పగిలిపోవడం జరుగుతూ తరచుగా లీక్ అవుతున్నాయని దానివలన నీటి సరఫరాకు అంతరాయం జరుగుతుందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల వరకే ఈ నూతన ట్యాంక్ నుంచి వాటర్ పోవడం జరుగుతుందని ట్యాంక్ ఎగువ ప్రాంతానికి నీటి సరఫరా జరగడం లేదని, దానికి సంబంధించిన ఎయిర్ వాల్స్‌కు సంబంధించి ఎస్టిమేషన్ తయారు చేయడం జరిగిందని, తయారు చేసిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తున్నామని త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రస్తుతం గ్రామంలోని పాత ట్యాంక్ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. నూతన ట్యాంకును పూర్తిస్థాయిలో వాడుకలోకి తీసుకొస్తాం. ప్రస్తుతానికి నూతన ట్యాంక్‌లోకి నీటిని ఎక్కించడం జరిగింది. ఈ ట్యాంక్‌లోకి ఎక్కిన నీరు లోతట్టు ప్రాంతాల వరకే సరఫరా జరుగుతుంది. జిల్లా కలెక్టర్‌కు పంపిన నివేదికకు సంబంధించి అనుమతి రాగానే నూతన ఎయిర్ వాల్స్ ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో గ్రామ ప్రజలకు త్రాగునీటి అందించడం జరుగుతుందని ఎంపిడివో సక్రియ తెలిపారు. గ్రామంలో ఎంపిడివో సక్రియ, ఎంపివో రాజేశ్వరి పర్యటించి పారిశుద్ధ్యం ఎక్కడ తలెత్తకుండా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు.

# విద్యుత్ స్తంభాలపై పిచ్చి తీగలు తొలగింపు




ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని తెలగవరం వద్ద, దారుక బంజరు వద్ద విద్యుత్ స్తంభాలపై పిచ్చి తీగలు అలుముకొని విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి నిలువుటద్దం అనే ప్రజాపక్షం వార్తకు విద్యుత్ శాఖ స్పందించి పిచ్చి తీగలను తొలగించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందుగానే సవరించడం పట్ల పెద్ద కోరుకొండి విద్యుత్ శాఖ అధికారికి ప్రజలు ధన్యవాదములు తెలిపారు.

# శతాధిక వృద్ధురాలు మృతి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని గొల్లగూడెం ప్రాంతానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఎస్‌కె ఫాతిమాబీ (100) గురువారం మృతిచెందారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా వారిలో ఇద్దరు కుమారులు మృతి చెందారు. వంద సంవత్సరాలు జీవించిన ఫాతిమాబీ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పదివేల వేతన హామీని అమలు పరచాలని ధర్నా



ప్రజాపక్షం/కల్లూరు: పదివేల వేతన హామీని అమలు పరచాలని కోరుతూ ఐకెపి వివోఏల సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకెపి వివో ఏల సంఘం జిల్లా కన్వీనర్ వేము నాగమణి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో వివో ఏ లకు నెలకు 10,000 ఇస్తానని హామీ ఇచ్చారని అట్టి హామీని అమలు పరచాలని, అదే విధంగా పెండింగ్ వేతనాలను వెంటనే అందించాలని, గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని, నేరుగా వివోఏల ఖాతాలో వేతనాలు జమ చేయాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని వ్యక్తిగత, ప్రమాద బీమా, సౌక ర్యం 10 లక్షలు సౌకర్యం కల్పించాలని కోరుతూ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి వినతి పత్రా న్ని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు, వివోఏలు రజిత, లలిత,వెంకట్రావమ్మ, కృష్ణవేణి, మరియమ్మ, మల్లిక, కోటేశ్వరి, దేవమణి పాల్గొన్నారు.

# ఘనంగా అటవీ అమరవీరుల దినోత్సవం



ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అటవీ అమరవీరుల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, కల్లూరు ఏసీపీ రఘులు పాల్గొని అటవీ శాఖ ఉద్యోగులకు అటవీ అమరవీరుల స్తూపం వద్ద ఘన నివాళులర్పించారు. అనంతరం అటవీ అధికారులకు అటవీ శాఖ ఆధ్వర్యంలో రెయిన్ కోట్, టార్చ్ లైట్, వాటర్ బాటిల్ అందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, ఎఫ్.ఎడి.ఓ మంజుల, సత్తుపల్లి రేంజ్ ఎఫ్ ఆర్ ఓ స్నేహలత, తల్లాడ రేంజ్ ఎఫ్‌ఆర్‌ఓ ఉమా, డిఆర్‌ఓ పిచ్చేశ్వరరావు, డిఆర్‌ఓ రామ్ సింగ్, డిఆర్‌ఓ శ్రీను, సెక్షన్ అదికార్లు నాగరాజు, అరుణ్, నరసింహారావు, బీట్ ఆఫీసర్స్, క్యాంప్ ఆఫీసర్స్, ప్రైవేట్ వాచ్ మెన్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలా రాణి,మాజీ కౌన్సిలర్స్ నాగుల్ మీరా, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, కమల్ పాషా, చల్లగుళ్ల కృష్ణయ్య, పింగిలి సామెలు, గఫార్, భాస్కర్, సత్తుపల్లి పట్టణ,మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులకు జీతాలివ్వాలని వినతి



ప్రజాపక్షం/వైరా: గ్రామపంచాయతీ కార్మికుల జీతాలను తక్షణమే అందజేయాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులతో కలిసి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపివో రాజేశ్వరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు ఆళ్ల శ్రీను మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్రమైన ర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాలు నెలనెల సక్రమంగా ఇవ్వకపోవడంతో కార్మికులు వారి కుటుంబాలు వేదనపడే ప్రమాణం ఉందన్నారు. అడ్డాల మీద కూలీలకు ఇస్తున్న వేతనం కూడా పంచాయతీ కార్మికులకు ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. అనంతరం ప్రతి గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులందరూ ఇన్సూరెన్స్ రెన్యువల్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తేళ్లూరు రాజేష్, నాగుల్‌మీరా ఉన్నారు.

# మహోత్తర పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

-సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు



ప్రజాపక్షం/బోనకల్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన మహోత్తర పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. మండలంలోని చిరునోముల గ్రామంలోని తామ్రపత్ర గ్రహీత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు రావెళ్ల జానకీరామయ్య స్థూపానికి పూలమాలలు వేసి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో, నిజాం పాలనలో జరుగుతున్న దోపిడి, పీడన, వెట్టిచాకిరి, దొరలు, జమీందారులు, జాగీర్దారులకు వ్యతిరేకంగా జరిగిన మహత్తర పోరాటంలో కమ్యూనిస్టు యోధులు అనేక త్యాగాలు చేసి ప్రజలకు అండగా నిలచారని అన్నారు. మండలంలోని ప్రతి గ్రామం ప్రత్యక్షంగా, పరోక్షంగా సాయుధ పోరాటంలో పాల్గొన్న చరిత్ర ఉందని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని, 3 వేల గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయని, వెట్టిచాకిరి రద్దు చేయబడిందని, జమీందారులను గ్రామాల నుండి తరిమికొట్టారన్నారు. సాయుధ పోరాటంలో ఎందరో త్యాగధనులు తమ ప్రాణాలను సైతం అర్పించి తెలంగాణను నిజాం పాలన నుండి విముక్తి కల్పించారని, వారి త్యాగాలను ప్రస్తుత యువతకు తెలిజేసేందుకు ప్రతి సంవత్సరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు తూము రోషన్‌కుమార్, బోళ్ల ప్రసాదరావు, ముష్టికుంట్ల శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, చిరునోములు గ్రామ కన్వీనర్ గుంపుల జయరాజు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# జయరాజు కుటుంబాన్ని పరామర్శించిన ప్రీతం



ప్రజాపక్షం/వైరా: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం వైరా మండలం దాచాపురం గ్రామంలో వేల్పుల జయరాజు కుటుంబాన్ని పరామర్శించారు. జయరాజు కుమారుడు వేల్పుల రత్నభారత్, వారి కుటుంబ సభ్యులను అధైర్యపడవద్దని, మీకు అన్ని విధాలుగా కాంగ్రెస్ పార్టీ తరపున మేమందరం అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ దర్జీ చెన్నారావు, పమ్మి అశోక్, అయిలూరి కృష్ణారెడ్డి, సామల భాస్కర్‌రెడ్డి, గూడూరు రామశేషిరెడ్డి, వేల్పుల జయరాజు, కర్నాటి కృష్ణారెడ్డి, తేళ్లూరి వీరయ్య, కంభంపాటి సత్యనారాయణ, కట్ల సాయి, వేల్పుల బాబు, వేల్పుల సుందర్‌రావు, మదుపల్లి ప్రసాద్, వేల్పుల యేసు, వేల్పుల లింగేష్, వేల్పుల మైకేల్, జవ్వాజి రామశేషయ్య, కూరాకుల కృష్ణయ్య, ఆదూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వైరా మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/వైరా: వైరా మండల రిటైర్డ్ ఉద్యోగుల నూతన కమిటీ కార్యవర్గ న్నిక నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా చల్లా కృష్ణారావు, మార్ల జయశంకర్, కోశాధికారిగా సామినేని వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా షేక్ వలీజాన్, ఉపాధ్యక్షులుగా పెంటయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె.సరస్వతి, కార్యదర్శులుగా జి.సుబ్బయయ, సిహెచ్‌ఎస్‌వి.ప్రసాద్, మహిళా కార్యదర్శిగా కొల్లిపర్ల శారదాదేవి, జిల్లా కౌన్సిలర్లుగా సూత కాని ప్రసాద్, జివి.కృష్ణారావు, పొన్నం నర్సింహారావులను ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. మధిర మండల శాఖ ప్రధాన కార్యదర్శి మందయ్య, తల్లాడ మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మయ్య ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. అనంతరం పదవీ ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు చల్లా కృష్ణారావు, మాచర్ల జయశంకర్‌లు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జిల్లా శాఖల పిలుపు మేరకు పోరాట కార్యక్రమాలకు సంసిద్ధులుగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్య రహిత సమాజ స్థాపనకు అంతా కృషి చేయాలి

**- ఎస్‌పి రోహిత్ రాజ్**



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. పాల్వంచ (నవభారత్) కేఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఆయన ముఖ్యాతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల దృష్టి తమ భవిష్యత్, లలక్ష్యంపై మాత్రమే ఉండాలని, నిషేదిక గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల వాడకం పట్ల విద్యార్థులు, యువత ఆకర్షితులు కావద్దన్నారు. గంజాయి, డ్రగ్స్ అలవాటు వల్ల శరీరక, మానసిక వ్యాధులు వస్తాయని, మాదకద్రావ్యల నిర్మూలన, గంజాయి రహిత జిల్లా లక్ష్యంగా పోలీస్ శాఖ కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా పలు విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్ ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ జగన్మోహన్‌రావు, పాల్వంచ ఎస్సై సుమన్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి పథకం అమలు చేయాలని బ్యాలెట్ ఓటింగ్

**-ఓటింగ్‌ను అడ్డుకోవడానికి నిరంకుశ పద్ధతులు అవలంబించిన సింగరేణి యాజమాన్యం**
**-స్వచ్ఛందంగా పెద్దసంఖ్యలో పాల్గొన్న కార్మికులు**




**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి వ్యాప్తంగా సిఐటియు నిర్వహిస్తున్న సొంత ఇంటి పథకం అమలు కోసం బ్యాలెట్ ఓటింగ్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సొంత ఇల్లు కావాలని కోరుకుంటున్నారని సింగరేణి కాలరేస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం పివికే గనిలో నిర్వహించిన బ్యాలెట్ ఓటింగ్ లో సింగరేణి బొగ్గు బావుల వద్ద ,అధికారుల కార్యాలయాల వద్ద గని కార్మికులు పాల్గొని అధిక అధిక సంఖ్యలో కార్మికులు అధికారులు పాల్గొన్నారన్నారు. యాజమాన్యం నిరంకుశంగా ఈ కార్యక్రమం అమలు జరగకుండా ఉండడానికి క్రింద సాయి అధికారులకు గేటు బయటనే నిర్వహించాలని ఎన్ని ఆంక్షలు విధించి ఆదేశాలు జారీ చేసినప్పటికీ కార్మికులు పూర్తిగా ఓటింగ్లో పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు, సింగరేణి కోల్ బెల్ట్ ఏరియా ప్రభుత్వ ప్రజాప్రతినిధులు సొంతింటి పథకం అమలు చేస్తామని హామీలు ఇచ్చినప్పటికీ ఏమాత్రం కూడా చిత్త శుద్ధితో వ్యవహరించలేదని దీనికి నిదర్శంగా గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలలో ఉన్న కార్యకర్తలు ఓటింగ్లో పాల్గొన్నారని తెలిపారు. కార్మికుల అభిప్రాయాన్ని మరోమారు సింగరేణి యాజమాన్యం దృష్టికి ప్రజా ప్రతినిధులకు ఈ ఓటింగ్ ద్వారా కార్మికులు ఏమి కోరుకుంటున్నారో వారి అభిప్రాయాన్ని ఈనెల 15వ తేదీన సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద ఫలితాన్ని బహిరంగ పరుస్తామని ఆయన అన్నారు. కొత్తగూడెం ఏరియాలో అన్ని మైన్స్ డిపార్ట్మెంట్లలో బ్యాలెట్ ఓటింగ్ విజయవంతమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.వెంకటేశ్వరరావు, ఎలగొండ శ్రీరామమూర్తి, గడల నరసింహారావు, లిక్కి బాలరాజు, భూక్యా రమేష్, కార్తిక్, సంపత్, బాలరాజు, నందిపాటి రమేష్, పి.వి. లక్ష్మీనారాయణ, ఆనందరావు, నునావత్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను శరవేగంగా పూర్తి చేయాలి

**-వన మహోత్సవం ను విజయవంతం చేయాలి**
**-ఎంపీడీవో యం.యర్రయ్య**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కొంగర, కట్టుకాచారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల ను పరిశీలించారు. లబ్దిదారులకు పలు సూచనలు చేశారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమం ను విజయవంతంగా పూర్తి చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని బుద్దారంరాయగూడెం రహదారి వెంట వన మహాత్సోవంలో భాగంగా నాటుతున్న మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల ను శర వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం ను నెరవేర్చేందుకు లబ్దిదారులు వేగవంతంగా చేపట్టాలని అన్నారు. గ్రామాలలో రహదారికి ఇరువైపులా మొక్కలను నాటాలని సూచించారు. నాటిన ప్రతీ మొక్కకు కంచెను ఏర్పాటు చేయాలని సూచించారు. వాటి సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పారిశుద్ధం పనులు యుద్ధప్రాతిపధిక ను చేపట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏ.గోపి, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాస్యులుగా మార్చేందుకు వివోఏలకు శిక్షణ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిరక్షరాశులను అక్షరాసులుగా మార్చేందుకు శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి నివేదిత ప్రారంభించారు. మండల పరిధిలోని 23 గ్రామ సమాఖ్యలు లో గ్రామపంచాయతీలలో గ్రామ సమాఖ్య అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం శిక్షకులు సుధాకర్, మౌలాలిలు నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2027 సంవత్సరం వరకు పూర్తిస్థాయిలో అక్షరాసులుగా మార్చేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని శిక్షకులు తెలిపారు. నూరు శాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా ప్రాథమిక విద్య వరకు జీవన నైపుణ్యాలు పెంపొందించడం కొరకు భవితంలో అనేక సమస్యల పరిష్కరించుకోవాలంటే చదివే ఆయుధంగా అన్ని దానాల కన్నా విద్యాదానం మిన్న 15 సంవత్సరాలు దాటిన వారికి ప్రాథమిక విద్యను పూర్తి చేయాలని లక్ష్యంతో అనుకూలమైన సమయంలో విద్య నేర్చుకోవాలని ఈ కార్యక్రమాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన లక్ష్యంగా ఎంచుకున్నట్టు వారి పేర్కొన్నారు త్వరలో వాలంటీర్ల ద్వారా గ్రామాలలో గ్రామ సమైక్యలు వివో ఏలు సమన్వయంతో ఉచితంగా విద్య బోధన లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ సమాఖ్యలు, వివోఏలు పాల్గొన్నారు.

# రోడ్డుపై గుంతలు పూడ్చాలని నిరసన



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి గాయాలకు గురవుతూ ప్రాణాలు పోతున్నాయి. అలాగే రోడ్డు వెంట పాదాచారులు నడవలేని పరిస్థితి ఏర్పడింది. ఎంతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల పట్టింపు లేనితనం, రోడ్డు ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. ఎంతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేయించాలని బిఆర్ఎస్ యువజన నాయకుడు గద్దల రామకృష్ణ రోడ్డుపై ఉన్న గుంతల్లో కూర్చొని నిరసన తెలుపుతూ డిమాండ్ చేశారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ఏన్కూరు :** మండల పరిధిలోని తిమ్మరపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇస్సన్నపల్లి కృష్ణ చిత్రపటానికి గురువారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కృష్ణ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన విషయం ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ధైర్యంగా ఉండాలని కోరారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, ఏ బ్లాక్ అధ్యక్షులు వేముల కృష్ణ ప్రసాద్, తిమ్మారావుపేట మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్, నాయకులు వీరు నాయక్, దళపతి భువనేశ్వర్ రాజు, నన్నే ఖాన్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఎంఈఓకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయ అవార్డు పొందిన నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి, భైరవునిపల్లి గ్రామానికి చెందిన బాలిన చలపతి రావు ను గురువారం తన సొంత గ్రామస్తులు అభినందించి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడారు. ఎంఈఓ గా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా ప్రమాణాలను అందించేలా ఉపాధ్యాయులతో సమన్వయాన్ని నిర్వహిస్తూ విధి నిర్వహణలో బాధ్యతాయుతమైన పాత్ర నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఆరెగూడెం ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఆయన మండలంలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. దూర ప్రాంత విద్యార్థులకు తన సొంత ఖర్చులతో ఆటోను ఏర్పాటు చేసి పిల్లలను చదివిస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి ఉత్తమ అవార్డును ఇవ్వడం గర్వించదగిన విషమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు గొల్ల శ్రీనివాస్ రావు, మల్లెబోయిన శ్రీనివాస్ రావు, పొలంపల్లి వేంకట పిచ్చయ్య, కనకబండి కనకనాగరాజు, గండు సైదులు, రేపాల జయ రామ్ రావు, నూక పెద్ద నాగయ్య, పొన్నగాని శ్రీనివాస్ రావు, బాలిన లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ పెంపుపై ప్రభుత్వంతో తేల్చుకుంటాం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** పెన్షన్స్ పెంపు సాధన కోసం ప్రభుత్వంతో తాడో పేడో లేల్చుకుంటామని ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జీ తోళ్ల సురేష్ హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయాల ముట్టడిని విజయంతం చేయాలని కోరుతూ, మండల కేంద్రంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేనిఫోస్టోలో అమలు చేసిన విధంగా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. పెన్షన్స్ పెంచుతామని చెప్పి ఓట్లు వేయించుకుని మోసం చేస్తున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చి 21 నెలలు గడస్తున్న రేవంత్ రెడ్డి పట్టించుకోవటం లేదని అన్నారు. ఈ నెల 15 న స్థానిక తహశీల్దార్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం ను చేపట్టినట్లు తెలిపారు. ఈ ముట్టడి కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పొట్టపింజర బాలస్వామి, తోళ్ల వెంకన్న, రాయబారపు గురవయ్య, శ్రీను, రామదాసు, గుండెపొంగు శ్రీకాంత్, కుక్కల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.